


ముక్తేవి భారతి

అనుకోకుండా మొదలైంది వాన.

పక్కింటివాళ్ళ పిల్లలు, ఆ పిల్లల తల్లి, ఆవిడ మరిది, ఆ ఇంటాయన కూడా కిటికీలోంచి రోడ్డును చూస్తున్నారు. వానలో తడవటాన్ని లెక్కపెట్టదేమిటన్నట్లు తడుస్తూ పోతున్నవాళ్ళని, ఆ వానకే మొక్క మొలుస్తామన్నట్లు ఇళ్ళపక్కన, చెట్లకింద తల దాచుకుంటున్న వాళ్ళని, బట్టలమీద వాన నీళ్ళు చిందివడుతూ మోవని ముద్దుగావే భయపడి దిక్కుతోచకుండా పరిగెత్తే పడుచువాళ్ళని, చూస్తూ, నవ్వుకుంటూ, మధ్య మధ్య జాలిపడుతూ, వెక్కిరిస్తూ, విసుర్కుంటూ ఆ కిటికీలోనే అన్ని తలలూ అవతలకు జరగనీయకుండా ఆనందపడుతున్నారా ఇంటివాళ్ళు.

వానచినుకు పడిందంటే చాలు ఇందిరకి కోపం!

'ఎన్నాళ్ళకు వానచినుకు పడిందండీ' అంటుంది కుంభవృష్టి కురుస్తుంటే పక్కింటావిడ.

ఇందిర కిటికీలోంచి చూసింది — అమ్మో! ఆ వానచినుకు కిటికీలోంచి ఇంట్లో పడితే —? గబుక్కున లేచి కిటికీ తలుపువేసి కూచుంది ఇందిర.

ఒక్కసారి గదంతా పరిశీలనగా చూసుకుంది. కిటికీకి అందమైన కర్టెనులు, గోడలకి చక్కని పెయింటింగ్స్, మూలల పూలకుండీలు, ఆ పక్కగా రేడియో, దానిమీద డాన్సింగ్ డాలు, ఒక పక్కగ పేజీ కూడా తిరగెయ్యకుండా, నలగకుండా అట్టలువేసి అమర్చిన పుస్తకాల షెల్ఫు, మధ్య టేబుల్‌మీద ఖరీదయిన ఆల్బమ్, అందులో అన్నీ తన పెళ్ళినాటి అందమైన రంగు ఫోటోలు — ఫోటోలు— ఒక్కొక్క పేజీ తిప్పుతోంది ఇందిర.

తలుపు చప్పుడవటంతో సోఫాలోంచి లేచింది.

'రెండగ్గిపుల్లలుంటే అమ్మ ఇమ్మంది' చిన్ని చింపిరిజుట్టు పక్కకు తోసుకుంటూ అడిగింది.

'ఏం మీ అన్నయ్య ఇంట్లో లేడా.'

'ఉన్నాడండీ...కాని వానకదూ, అందుకు కొట్టుకు వెళ్ళలేదు.

'అవును, వాన...' ఇందిర లేచి రెండంటే రెండే అగ్గిపుల్లలు తెచ్చి చిన్ని చేతిలో పెట్టింది.

'అబ్బ...ఛీ' తడిపాదాలు గదిలో అక్కడక్కడా కనిపించాయి. ఇందిర విసుక్కుంటూ గదంతా పాత గుడ్డతో వత్తింది.

ఆఫీసునుంచి వచ్చి చాలాసేపయి గదిలో పేపరు చదువుతూ పడుకున్నాడతను.

'వేడిగా కాఫీ తాగుదామా హాయిగా' అతని చేతిలో పేపరు పక్కన పడేస్తూ అంది ఇందిర.

'కాఫీ ఏమిటి...ఈ వానలో వేడిగా పెసరట్లు చేసిపెడితే.'

'పాపం...కష్టపడతారు' కాఫీ తాగుతూ చిన్నికిచ్చిన రెండగ్గిపుల్లలు గుర్తొచ్చి నవ్వుకుంది ఇందిర.

* * *

వాన నెమ్మదిగా పెద్దదయింది. అతనికి వానంటే చాలా సరదా. వానలో తడుస్తూ గుమ్మంలో నిలబడం అతనికి ఇష్టం విజానికి...కానీ...

మళ్ళా తలుపు చప్పుడవటంతో విసుక్కుంది ఇందిర,

'ఏం కావాలి—'కాఠిన్యం గొంతులో మారు మ్రోగుతోంటే ఇందిర ప్రశ్న.

'లోపల గుమ్మంలో కూచుంటా' తడిసిన బట్టలు, నెత్తిన నీరుకారుతూ ముసలాడు.

'బయట నుంచున్నావు చాలదూ' దభీమని తలుపేసింది.

'పోనీ రానీయకూడదూ—వాన తగ్గాక వాడే పోతాడుగా'

'అబ్బా...మీ కంత జాలయితే పిలిచి మీ కోట్లుకూడా రెండు కప్పండి పాపం. అతడి గుడ్డలు వాడూ...ఛీ, చుట్ట కాల్చు కుంటూ...'

'పాపం ... ముసలాడు కదూ' అతను గుమ్మం తెరిచాడు. ఖాళీ గుమ్మం వెక్కిరించింది. ఒక్క వ్యక్తికి ఒక్క నిముషం ఆశ్రయం ఇవ్వలేడు తను!! ఇందిరకేసి చూసి లోపలి కెళ్ళిపోయా డతను. ఒక్క క్షణంలో ముసలాడిని, వాననికూడా మరచి పోయి పుస్తకం చదవడంలో నిమగ్నుడై పోయాడు.

* * *

'తల తుడుచుకో ఈ బట్టతో' పక్కింటి అత్తయ్యగారి గొంతు

'నో అగ్గిపుల్ల యియ్యి బుల్లెమ్మా, చుట్ట కాల్చుకుంటా, కాస్త వెచ్చగా వుంటుంది...'

'ఏం పని చేస్తావురా అబ్బీ—' ఇంటాయన ప్రశ్న.

'కూలి పని బాబయ్యా...'

'సరే కానీ...తల బాగా తుడుచుకో... మళ్ళా జలుబు చేస్తుంది......తెల్లారితే కూలికి పోవద్దా...'

'వానకి తడవటం, ఎండకి ఎండటం అలవాటే తల్లీ.'

'తాతా, అన్నం తిన్నావా' చిన్ని చిన్న గొంతు.

'వాన తగ్గినాక గంజి కాసుకుంటా'

'మరి నీకు ఆకలెయ్యదా... నేనయితే ఎప్పుడో తినేసా తెలుసా...తాతా, అమ్మతో చెప్తా అన్నం పెట్టమని...తింటావా?'

'వద్దులే బుల్లెమ్మా...పోతాగా కూసే పాగి—!

'అన్నం తిని పడుకో...పొద్దున పోదు గానిలే'—

అన్నం తిన్నాడు ముసలాడు. విస్తరి మడుస్తూ,

'మీ రాటోళ్ళున్నారు కాబట్టే...... పపంచం ఇట్టా వుంది...అంతా ఆ పక్కింటమ్మలాటోళ్ళయితే...' వాడు ప్రేవున లేచ్చి, విస్తరి వీధిలోకి విసరికొట్టాడు.

* * *

తలుపుపక్కగదిలో సోఫాలో పడుకుని సంభాషణ వింటున్న ఐశ్వర్యవంతుల ఆడబిడ్డ, ఆధునిక ఆదర్శాల ఆటపట్టు ఇందిరకి షాక్ కొట్టింది.

* * *

వాన ఇంకా ఇంకా పెరిగిపోయింది. భూనభోంతరాళాలు ఏకం చేస్తూ కుంభ వృష్టి కురిసింది. ఒక్కసారిగా ఇంట్లో దీపాలు ఆరిపోయాయి—ఆ అంధకారంలో ఒక్క వాస్తవం కళ్ళముందు మెరిసింది. —చిరిగిపోయిన చాప, ఆకారంలేని వంట గిన్నెలు, పాలు చాలక రక్కటిల్లే పసివాడి ఏడుపు, చిరిగినచీరతో ఆ ఇల్లాలు, బీడీ ముక్క కాలుస్తూ లోతుకుపోయిన కళ్ళతో ఇంటాయన, చింపిరిజుట్టు చిన్ని, నిరుద్యోగి మరిది...వీళ్ళు, వీళ్లే తన పక్క వాళ్ళు—వీళ్ళుండబట్టే ప్రపంచం ఇంకా ఈమాత్రం పచ్చగా వుందిట!

తనుండబట్టి—!'

మెట్లులేని అంతస్తునుంచి కింద పడింది ఇందిర.

* * *

'నాన్నా మన పొట్లపాదు బోల్డు కాయలు కాస్తుంది కదండీ—'

'అవును తల్లీ'—

అవి మనం అందరికీ ఇస్తాం కదండీ నాన్న—మన పిన్నికి, మీ ఆఫీసులో అబ్బాయికి, మన పక్క ఇందిర అత్తయ్యగారికి—అందరికీ ఇయ్యాలి కదండీ...' చిన్ని తియ్యని గొంతు ఇందిరని కదలించి వేస్తోందా చీకట్లో—

గదిలో సోఫాలు, ఫాను, తన అందమైన పూలకుండీలు తన డాన్సింగ్‌డాలు, తన ఆధునికత—అవే జీవం అనుకుని నమ్మింది—ఏమిటో అన్నీ జీవం లేకుండా వున్నవైనా, ఈ రోజు ఒకటితో ఒకటి తనను చూసి వెక్కిరించి నవ్వుకుంటున్నాయ్. గుసగుసలు చెప్పుకుంటున్నాయి.

* * *

తెలతెలవారుతోంది. నిద్రపట్టని ఇందిర కిటికీలోకి చూచింది...రాత్రి వాన!?

ఇందిర కళ్లలో నీళ్లు నిలిచాయి—

వాన పడుతుంటే కిటికీలో నుంచుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకునే పిల్లలు తనకు లేరు, లేరేమిటి తనే వద్దనుకుంది ఇంతదాకా...తన దొడ్లో పచ్చగా పెరిగిన పొట్లపాదు తనకు లేదు...

మనిషిగా బతకటానికి కావలసిన ఒక ధర్మం...తనకు లేదు...

ఈ వాన ఎండిన మానుల్ని చిగిరిస్తుంది—

ఈ వాన తనలో మానవత్వాన్ని......

వానలో తడిసిన ముసలాడు కళ్ల ముందు నిలిచాడు — ఇందిర ఒణికి పోయింది. ●




